చుప్పనాతి పెట్టిన చిచ్చు

చల్లా రాధాకృష్ణ శర్మ



[చూలాలని కూడా చూడకుండా రాముడు సీతను అడవులకు పంపిన కథా ఘట్టం కరకు గుండెను సైతం కరిగిస్తుంది. సీతా పరిత్యాగానికి శూర్పణఖ కారణభూతయైనట్లు జానపదులు కొందరు ఊహించారు. ఈ అంశమే ఈ కథకు ఆధారం.]

పండు వెన్నెల. చల్లనిగాలి. మెత్తని పరుపు. ఎటు చూసినా పచ్చని చెట్టుచేమలు.

శూర్పణఖ మాత్రం నిద్ర పోలేదు. ఎంత ప్రయత్నించినా, కళ్ళు మూత పడలేదు. 'అంతా ఆ సీతమూలంగా జరిగింది' అంటూ మంచంమీదనుంచి లేచికూర్చుంది, ఇలా ఎప్పుడైతే. అనుకుందో వచ్చిన నిద్రమత్తు కూడా పోయింది.

సీత మీద మరులు గొనడం వల్లనే గదా వీరాధివీరుడైన మా అన్నయ్య రావణుడు ఈ లోకంనుంచి నిష్క్రమించవలసి వచ్చింది. రామరావణ యుద్ధంలో ఎందరెందరో కన్నుమూశారు. చివరికి కళకళలాడే లంకారాజ్యం సర్వనాశనమై పోయింది. లంక! ఎంత సుందరమయింది! ఆ సిరిసంపదలు తలుచుకుంటేనే గుండె చెరువై పోతోంది... అనుకుంటూ శూర్పణఖ బాధ పడింది. ఆమె మనస్సు వికలమై పోయింది.

ఉన్నట్టుండి ఆమె అంతరాత్మ 'ఆ సీత సౌందర్యాన్ని నువ్వే గదా దశకంఠుడికి తెలిపి పుణ్యం కట్టుకున్నావు!' అంది. దాంతో ఆమెకు పిచ్చెత్తినట్టయింది. 'అవును నేనే... నేనే... రామ రావణ

యుద్ధానికి కారకురాల్ని నేనే...' ఈ మాటలు తలవని తలంపుగా ఆమె నోటినుంచి వెలువడ్డాయి. అయితే యీసారి ఆమె బాధపడలేదు దానికి బదులుగా ఈర్ష్య ఆమె మనస్సుని ఆవరించింది. ఆమె మరీ పిచ్చిదై పోయింది. యుక్తాయుక్తజ్ఞానాన్ని పూర్తిగా కోల్పోయింది. సీత అంటే మండిపడ సాగింది.

రావణుడు నశించిన తర్వాత.... లంకారాజ్యం నాశనమై పోయినతర్వాత... సీత అయోధ్యానగరంలో అంతఃపురంలో సకల రాజ్య భోగాలూ అనుభవిస్తూ హంసతూలికా తల్పాన నిశ్చింతగా శయనించడమా!... చుప్పనాతి తనం శూర్పణఖని వశపరచుకుంది. పశువుగా మార్చివేసింది.

ఆ రాత్రి ఎలాగో గడిచిపోయింది.

మామూలుగానే తెల్లవారింది. అయితే శూర్పణఖ పూర్వపు శూర్పణఖ కాదు. యోగిని! ఆ కాషాయాంబరాలు... మెడలో ఆ రుద్రాక్షమాలలు.... చేత కమండలం... అచ్చం యోగినిలా ఉంది. ఆమె యిప్పుడు శూర్పణఖ అంటే తెలిసిన వాళ్లకూడా నమ్మరు.

"ఎక్కడికమ్మా అంత త్వరత్వరగా వెడుతున్నారు" అడిగింది చెలికత్తె.

"శకునపక్షి! నీ పని చూసుకో"

శూర్పణఖ చరచర నడిచి వెడుతోంది. ముఖం నిప్పులా వెలుగుతోంది. కళ్ళు నిప్పులు చెరుగుతూ వున్నాయి.

ఆమె అయోధ్యానగరంలో అడుగు పెట్టేసరికి బారెడు పొద్దెక్కింది. నగరంలో ఎటుచూసినా నవచైతన్యం. నగర పౌరులువిధ్యుక్త ధర్మనిర్వహణలో నిమగ్నులై పోయారు, వారంతా ఎంత సంతోషంగా తృప్తిగా వున్నారని! ఏడుపు ముఖం ఒక్కటైనా కనిపించలేదు. అది చూసేసరికి, ఆమెకు కన్ను కుట్టింది.

యోగిని వేషంలో ఉన్న శూర్పణఖను నగరపౌరులు పిన్నా పెద్దా ఆదరపురస్సరంగా చూశారు. చేతులెత్తి నమస్కరించారు. ఒక్క క్షణం ఆమె తన్నుతాను మరిచిపోయింది. ఎన్నడూ కలగని సంతోషం కలిగిందామెకు. ఇది రామరాజ్యమహిమ కాబోలు- అనుకుంది.

వెంటనే తాను వచ్చిన పనిని గుర్తు చేసుకుంది.

రాచనగరు వైపు నడిచింది. ఆ వీధుల అందచందాలూ అవేమీ ఆమెకి కనిపించలేదు.

ఎవరో యోగిని తనను చూడడానికి వస్తున్న విషయం అంచెలు అంచెలుగా రాముడిదాకా పాకింది. ఎక్కడికో సపరివారంగా బయలుదేరిన ఆ రాజు ఆమెను దర్శించి వెడదామనుకున్నాడు. ఆమె రాక కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూడసాగాడు.

ఇంతలో రాజభటులు యోగినిని రామునివద్దకు తీసుకువచ్చారు. ఆదరపూర్వకంగా అర్ఘ్యపాద్యాదులు ముగిసినతర్వాత, ఆమెను ఉద్దేశించి రాముడు కుశలప్రశ్నలు వేశాడు.

రాముణ్ణి చూసీ చూడగానే యోగిని అవాక్కయింది, అతని జగన్మోహనాకారాన్ని తిలకిస్తూ శిలలా కూర్చుండిపోయింది. 'ఈమెను సీతవద్దకు తీసుకు వెళ్ళండి' అని ఆజ్ఞాపించి యోగినివద్ద సెలవు తీసుకుని రాముడు పరివార సమేతుడై వెళ్ళిపోయాడు.

సీత నివసించే మందిరం ప్రవేశించింది యోగిని. సీత చేసిన సపర్యలకూ, చూపిన భక్తిభావానికీ ఆమె పరమానంద భరితురాలు అయింది. అన్నెమూ పున్నెమూ యెరుగని ఆ అమాయకురాలికి అపకారం తలపెట్టడం అవాంఛనీయ మనుకుంది, వచ్చిన దారినే వెడదామనుకుంది. కానీ మరుక్షణంలోనే శూర్పణఖ అయింది.

యోగిని సమక్షంలో రకరకాలస్వాదుఫలాలూ, రంగురంగుల పట్టుపుట్టాలూ ఎన్నో సీత ఉంచింది, స్వీకరించి అనుగ్రహించండి అన్నట్టుగా చూసింది. కానీ యోగిని దృష్టి వాటిమీద పడలేదు. ఆమె తృప్తిచెందక పోవడం చూసి, తనవల్ల ఏం అపచారం జరిగిందో అని సీత తల్లడిల్లి పోయింది.

"అమ్మా! తమ కోరిక యేమిటో సెలవిస్తే సంతోషిస్తాను" అంది సీత దీనంగా.

యోగిని మౌనం వహించింది.

"నావల్ల తమకెలాంటి అపచారమూ జరగలేదుగదా?"

"రావణుడి చెరలో ఎన్నాళ్ళున్నావు?" అడిగింది యోగిని.

ఏమిటీ ప్రశ్న! అనుకున్నారు సీత చెంత వున్న చెలికత్తెలు. రావణుడి పేరు వినగానే సీత కైతే ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లనిపించింది. చీకట్లో జడలు విరబోసుకున్న దయ్యాన్ని చూసినట్లనిపించింది.

"లంకలో ఎన్నాళ్ళున్నావు?" మళ్ళీ యోగిని ప్రశ్న వినిపించింది.

సీత అనిష్టంగా చెప్పింది. "సుమారు పదినెలలు"

మౌనం అలుముకుంది.

"సీతా"

"ఊఁ"

రావణుడు ఎలావుండేవాడో చెబుతావా, వినాలనివుంది.. "

సీత నిర్ఘాంతపోయింది. ఆమె నవనాడులూ క్రుంగిపోయాయి. ఈప్రశ్న వేసిన యోగిని నిజంగాయోగినా (కాదా?)అని సంశయించింది.

నువ్వు నీనోటితో చెప్పవద్దుగాని, రావణుడు ఎలా వుండేవాడో బొమ్మవేసి చూపించు- అది చాలు"

4

సీతకి సహనం నశించింది. ధైర్యమంతా కూడగట్టుకుని "ఆ దుర్మార్గుణ్ణి నేనుకన్నెత్తి అయినా చూడలేదు." అంది.

దేవతా విగ్రహాన్ని చూసినట్టుగా సీతను చూశారు" చెలికత్తెలు.

యోగిని హతాశురాలయింది. అయినా తెచ్చుకున్న ధైర్యంతో, విషపునవ్వు ఒలకబోస్తూ, "నా సంతోషం కోసం గుర్తున్నంతవరకూ బొమ్మగీస్తేచాలు." అర్థించింది యోగిని.

"ఆవిడ అంతగా అడుగుతుంటే, బొమ్మ రాయగూడదా ?" అంది చనువుగా ఒక చెలికత్తె.

"ఆ రావణుడు ఎలా వుంటాడో మాకూ చూడాలని వుంది" అంది మరో చెలికత్తె.

"చూశారా, మీ చెలికత్తెలే ముచ్చట పడుతున్నారు." అంది యోగిని, మరింత ధైర్యంగా.

"ఆ దుర్మార్గుణ్ని చూడండి నేనేం రాయను బొమ్మ" అని చెలికత్తెల్ని చురచుర, చూస్తూ సీత రావణుడి కాలిబొటనవేలు మాత్రం రాసింది.

బుజాలు ఎగురవేసుకుంటూ ఆ బొమ్మను తీసుకుని, యోగిని సీతవద్ద అనుజ్ఞ తీసుకుని, తన బసకు వెళ్లిపోయింది.

ఆ తర్వాత శూర్పణఖ రావణుడి బొమ్మను పూర్తి చేసింది. ఆ బొమ్మకు ప్రాణం పొయ్యమని బ్రహ్మదేవుణ్ణి అర్థించింది. జాలిపడి అందుకు సరే అన్నాడు బ్రహ్మ. రెండో కంటికి తెలీకుండా శూర్పణఖ ఆ బొమ్మను తీసుకువచ్చి సీత మంచంమీద దిండు కింద ఉంచింది. తన దారిని తాను వెళ్లిపోయింది. తన కోరిక నెరవేరుతుందనే సంతోషం కొద్దీ మరీ వెళ్ళిపోయింది.

శూర్పణఖ వెళ్లిపోయిన కొంతసేపటికి రాముడు అంతఃపురానికి వచ్చాడు. రావణుడి బొమ్మను రాయమని ? యోగిని సీతను వేధించుకు తిన్న విషయాన్ని ఎవ్వరూ ధైర్యం చేసి రాముడితో చెప్పలేదు. చెపితే యేమనుకుంటాడో యేమో అని భయపడ్డారు. చెప్పాలని సీతకూ అనిపించలేదు.

ఆ రాత్రి సీత తన శయ్యా మందిరం చేరుకుంది. ఆమె వెనకాలే రాముడూ వచ్చాడు.

సీత మంచం దగ్గరికి వెళ్లగానే, "రా, లంకకు రా" అంటూ మాటలు వినిపించాయి. ఆమె భయంతో వణికిపోయింది. రాముడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

"రా, లంకకు రా" అని మళ్ళీ వినిపించాయి మాటలు, యీసారి మరింత స్పష్టంగా.

కాళ్లకింది నేల కంపించినట్లనిపించింది సీతకి. మనస్సులో రామనామ స్మరణ చేసుకుంది. దారీ తెన్నూ తోచక.

దిండు కింది బొమ్మ మౌనం వహించింది.

పీడ విరగడ అయినందుకు సీత సంతోషించింది.

రాముడి కిదంతా వింతగా తోచింది. మంచం మీది పరుపుని సూక్ష్మంగా చూశాడు. అటూయిటూ పరికించాడు. దిండుని పైకి తీశాడు. రావణుడి బొమ్మ.

ప్రసన్న వదనుడైన రాముడు ప్రళయకాల రుద్రుడయ్యాడు.

ఆ భీకర మూర్తిని సీత చూడలేకపోయింది. నేలమీది చేపపిల్లలా మనస్సు గిజగిజ లాడింది.

"నేను ఏ పాపమూ యెరుగను....ఆ దుర్మార్గుడి బొమ్మ యిక్కడి కెలా వచ్చిందో నాకు తెలీదు...." సీత విలపించింది. పొద్దున మీరు పంపించిన యోగిని కుట్ర కావచ్చు యిదంతా...." అంటూ యోగిని వింతకోరికను తెలియజేసింది.

రాముడి కేమీ వినిపించలేదు.

ఇంతలో సీత చెలికత్తెలు అక్కడికి వచ్చారు. పొద్దున జరిగిన విషయాన్ని పూస గుచ్చిన విధంగా చెప్పారు. సీత నిర్దోషి అన్నారు. ఆమె కేమీ తెలియదన్నారు.

రాముడి కేమీ వినిపించలేదు. ఎవరి మాటలూ వినిపించుకునే స్థితిలో లేడు.

ఒక్క నిమిషంలో అంతఃపురం శోకపూరిత వాతావరణంతో నిండిపోయింది. అంతఃపురాంగనలు శిలావిగ్రహాలయ్యారు.

సీత కళ్లలో ఒక్క నీటి చుక్కకూడా మిగల లేదు. చలనం లేని బొమ్మలా కనిపించింది. ఆ బంగారు బొమ్మ!

క్షణ క్షణం చింతనిప్పులవుతున్న ఆ నీలమేఘశ్యాముని నయనాలను అక్కడున్నవారు చూడలేకపోయారు.

"లక్ష్మణా !" అన్నాడు రాముడు. మిన్ను విరిగి మీదపడ్డట్టుగా తోచింది. వెయ్యి పిడుగులు ఒక్కసారిగా పడ్డట్టు అనిపించింది. వందలకొద్ది పెనుతుఫానులు వీచినట్టు తోచింది.

"అన్నయ్యా !" భయభ్రాంతుడైన లక్ష్మణుడు సోదరుణ్ణి సమీపించాడు. అడుగులో అడుగు వేసుకుంటూ.

రాముడు ఏమిటో చెప్పాడు. ఆ రామానుజుడు తల వంచుకున్నాడు. కళ్లల్లో నీళ్ల తిరగగా, బదులేమీ చెప్పకుండా, వంచిన తలను పైకెత్తకుండా అతను వెనక్కి తిరిగాడు.

ఎక్కడో దూరాన గుడ్లగూబల కూతలు వినిపించాయి. ఎవ్వరో విషపునవ్వులు నవ్వుతున్నట్టు అనిపించింది.

ఆ చీకటి రాత్రి ఎలా గడిచిందో యేమిటో।

ఆ మరునాడు.

"సీత చూలాలు...."

"ఆమెను బాధించడం మంచిది కాదు...."

" ఏ పాపమూ ఎరగని స్త్రీని యిలా తిప్పలు పెట్టడం న్యాయం కాదు..."

అంతఃపురాంగనల యీ మాటలు ప్రత్యూష పవనాలలో కలిసిపోయాయి.

ముందు లక్ష్మణుడు....వెనక సీత....రథం అడవుల వైపుగా వెడుతోంది.

దిష్టిబొమ్మలా రాముడు సింహాసనం మీద ఆసీనుడైవున్నాడు.